## ఓయూలో ముగిసిన సింపోజియమ్స్

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 23: ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలోని అన్ని విభాగాలలో నిర్వహిస్తున్న సింపోజియంలు శనివారం ముగిసాయి. వీటిలో భాగంగా విద్యార్థులు పలు విభాగాలలో పోటీలు నిర్వహించి, వివిధ అంశాలలో విజేతలను ఎంపిక చేశారు. ఈ పోటీలలో విద్యార్థులకు తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం ఉండటంతో రాష్ట్ర వ్యాప్తంగా పలు కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. దీంతో యూనివర్సిటీ సందడిగా మారింది. ఈ సింపోజియంలను అధ్యాపకులతో సంబంధం లేకుండా ఆయా విభాగాల విద్యార్థులే నిర్వహించారు. అధ్యాపకులు కేవలం సలహాదారులుగా వ్యవహరించారు. ఈ సింపోజియంలకు హాజరైన అతిథులు విద్యార్థులకు విలువైన సూచనలు చేశారు. విద్యార్థులు సృజనాత్మకతతో ఆలోచిస్తే కొత్త ఆవిష్కరణలు వెలుగులోకి వస్తాయని అభిప్రాయపడ్డారు. ప్రతిభ ఉన్న విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించేందుకు కంపెనీలు పోటీపడతాయని వివరించారు. ఈ ముగింపు ఉత్సవంలో సింపోజియంలో భాగంగా నిర్వహించిన పలు పోటీలలో గెలుపొందిన అభ్యర్థులకు నగదు బహుమతులు అందజేశారు. పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

## 26 నుంచి ఎంఎల్ఆర్ఐటీలో జియోగ్రాఫికల్ మహోత్సవం

దుండిగల్, మార్చి 23: దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎల్ఆర్ఐటీ) కళాశాలలో ఈ నెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు మూడు రోజుల పాటు కళాశాలకు చెందిన ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఫెసిలిటేషన్ సెంటర్ ఆధ్వర్యంలో జియోగ్రాఫికల్ ఇండికేషన్ మహోత్సవం నిర్వహించనున్నామని కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ఫౌండర్ సెక్రటరీ, మల్కాజిగిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాసరావులు తెలియజేశారు. భారత ప్రభుత్వ చిన్న, మాధ్యమిక పరిశ్రమల శాఖ వారు జియోగ్రాఫికల్ ఇండికేషన్ వస్తువులు, ఉత్పత్తులను ప్రోత్సహించాలని తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా తమ కళాశాలలో మూడు రోజుల పాటు 50 స్టాళ్లలో పలు రకాల జియోగ్రాఫికల్ ఇండికేషన్ వస్తువులు ఉత్పత్తులను ప్రదర్శిస్తారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలంతా ఈ స్టాల్స్‌ను సందర్శించి ఉత్పత్తులను కొనుగోలు చేసి ప్రోత్సహించాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా ఇందులో పోచంపల్లి, బెనారస్ చీరలు, నిర్మల్, కొండపల్లి బొమ్మలు, చేర్యాల పెయింటింగ్స్, మహాబలిపురం స్టోన్ కార్వింగ్స్, హైదరాబాదీ బిర్యాని, అరకు అరాబిక కాఫీ తదితర స్టాల్స్ ఉంటాయన్నారు.

## కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయండి

**యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా**

సుల్తాన్‌బజార్,మార్చి 23. ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 510 జీవోతో తీవ్ర అన్యాయం జరిగిందని, సుమారు 40 వేల కుటుంబాలకు న్యాయం చేయాలని ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా అన్నారు. ఈ మేరకు శనివారం టీజేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరామ్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ 2018లో ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఐట్ సోర్సింగ్ విధానంలో 510 జీవోతో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఈ జీవోతో సుమారు 4 వేల కుటుంబాలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. జీవోతో నష్టపోయిన 4 వేల కుటుంబాలు చీకటిలో మగ్గుతున్నాయని, ఆ కుటుంబాలలో వెలుగులు నింపాలన్నారు. ఈ విషయమై సానుకూలంగా స్పందించిన ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ, ఎవరికైతే అన్యాయం జరిగిందో వారికి న్యాయం చేయడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంపత్ కుమార్, సందీప్ కుమార్ పాల్గొన్నారు.

## హోలీ.. రంగోలి



నిజాం కళాశాల విద్యార్థులు శనివారం హోలీ వేడుకల్లో మునిగితేలారు. హోలీ పండుగ సోమవారం కావడం, ఆదివారం కళాశాలకు సెలవు దినం కాగా, ముందస్తుగానే ఉత్సవానికి తెరలేపారు. విద్యార్థులు రంగులు చల్లుకుంటూ వేడుకను ఎంతో ఉత్సాహంగా, అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఒకరికొకరు రంగోలి చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకొని ఆనంద తాండవం చేశారు.



నగరంలోని బేగంపేట వాతావరణ కేంద్రంలో ప్రపంచ వాతావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థుల సమక్షంలో ఆ శాఖ అధికారులు విద్యార్థులకు జ్ఞానాన్ని పంచుతూ శనివారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు వాతావరణ విషయాలపై సంధించిన పలు ప్రశ్నలకు అధికారులు అవగాహన కల్పించి, వారిని సమాధానపర్చారు. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను విద్యార్థులు ఎంతో ఆసక్తిగా వీక్షించారు. ఇందులో భాగంగానే నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌కు సంబంధించిన ప్రదర్శన కూడా ఇందులో భాగమైంది. పలువురు విద్యార్థులు పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు.



బీఆర్ఎస్‌కు జై కొడుతున్న అభ్యర్థి జ్ఞానేశ్వర్, ఎమ్మెల్సీ వాణీదేవి, ఎమ్మెల్యేలు సబితారెడ్డి, యాదయ్య, ప్రకాశ్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు

**కాంగ్రెస్ పాలనలో...**

# కరెంటు పోయింది.. కరువొచ్చింది

**మన ప్రాంతానికి సాగునీటిని తీసుకొద్దామనే ఆలోచనే రేవంత్‌కు లేదు**

**బడుగుల గొంతుక పార్లమెంట్‌లో వినిపించాలంటే కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలి**

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి**

పరిగి, మార్చి 23 : కాంగ్రెస్ వచ్చింది కరెంటు పోయింది, కరువు వచ్చిందని ప్రజలు బాధపడు తున్నారని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. కేసీఆర్ రైతు బంధు, రైతుబీమా, కేసీఆర్‌కిట్, మిషన్ భగీరథ ద్వారా తాగునీరు ఇచ్చి పేదలకు మేలు చేస్తే.. అంతకంటే బాగా చేస్తారేమోనని కాంగ్రెస్‌ను నమ్మి ఎన్నికల్లో గెలిపిస్తే మమ్మల్ని నట్టేట ముం చారని ప్రజలు వాపోతున్నారన్నారు. పరిగిలో శనివారం మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చేవెళ్ల అభ్యర్థులుగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి ప్రస్తుతం బరిలో ఉన్న ఇద్దరికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తోనే గుర్తింపు వచ్చిందన్నారు. విశ్వేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డిలను గత ఎన్నికల్లో బీఆర్ఎస్ శ్రేణులు కష్టపడి గెలిపించారని గుర్తు చేశారు. అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత రంజిత్‌రెడ్డి ఎందుకు పార్టీ మారారో తెలియదని...కానీ బీఆర్ఎస్ నాయకులు, కార్య కర్తల శక్తిని తక్కువగా అంచనా వేసి పార్టీ వీడిన వారికి మన శక్తి చూపించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రంజిత్‌రెడ్డి అంటే ఎవరో కూడా ప్రజలకు తెలియదని.. అలాంటి వ్యక్తికి కేసీఆర్ ఎంపీ టికెట్ ఇచ్చి గెలిపించారన్నారు. ఈ లోక్‌సభ ఎన్నికలను బీఆర్ఎస్ శ్రేణులు ఓ చాలెంజ్‌గా తీసుకుని కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉన్నారని, మన ప్రాంతం గురించి ఏమైనా మాట్లాడుతారని వంద రోజులుగా చూస్తున్నా ఫలితం లేదన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు దాదాపుగా పూర్తైందని.. త్వరగా కాల్వలు తవ్వి మన ప్రాంతానికి సాగు నీటిని తీసుకొద్దామనే ఆలోచన సీఎంకు లేదన్నారు. మైకు పట్టుకుంటే చాలు కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారన్నారు. గతేడాది డిసెంబర్ 9న వికారాబాద్ చౌరస్తాలో నిలబడి రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించారని, ఆ హామీని ఇంకా ఎందుకు అమలు చేయడంలేదని ప్రశ్నించారు. బీజేపీ వారు జైశ్రీరామ్ అంటుండగా.. కాంగ్రెస్ వారు గేట్లు ఎత్తుతామంటు న్నారని.. సీఎం రేవంత్‌రెడ్డి కండువాలు వేసి మురిసిపోతున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు ఈ ఎన్నికల్లో గెలిస్తే మనల్ని నిర్లక్ష్యం చేస్తారని.. బడుగుల గొంతు పార్లమెంట్‌లో వినిపించాలంటే జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి జ్ఞానేశ్వర్‌కు పరిగి, వికారాబాద్, తాండూరు అంటే ఎనలేని ప్రేమ అని, ఆయన జడ్పీచైర్మన్‌గా ఉన్నప్పుడు ఈ ప్రాంతాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డికి ఫోన్ చేసి మనవాళ్లు ఏమం టున్నారని అడిగితే..'మొదటి సమావేశాన్ని పరిగిలోనే ఏర్పాటు చేయాలని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు అందరూ సిద్ధంగా ఉన్నారని చెప్పార'న్నారు. పరిగి ప్రాంతంలోని అన్ని వర్గాల వారితో జ్ఞానేశ్వర్‌కు మంచి సంబంధాలున్నాయని, సేవాగుణంలో ఆయన ముందుంటారని కొనియాడారు. ప్రజానాయకుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించినందుకు కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. జ్ఞానేశ్వర్‌ను అభ్యర్థిగా ప్రకటించగానే బడుగు, బలహీన వర్గాల నుంచి మద్దతు లభిస్తున్నదన్నారు. జ్ఞానేశ్వర్ చేసిన సేవలకు రుణం తీర్చుకోవడంతోపాటు ఆయనను గెలిపించి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు బహుమతిగా ఇద్దామని సబితారెడ్డి బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. ప్రతి గ్రామంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లు వాటిని ఎలా పెంచుకోవాలనే దానిపై దృష్టి పెడితే తప్పనిసరిగా బీఆర్ఎస్ అభ్యర్థి విజయం ఖాయమన్నారు. సమావేశానికి వచ్చిన ప్రతి కార్యకర్త వంద మం దిని ప్రభావితం చేయాలని.. బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు బీఆర్ఎస్ శ్రేణులు రెండు నెలలపా టు ప్రజా క్షేత్రంలోనే ఉండాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందని మాట్లాడే వారిపై మండిపడ్డారు. సూర్యాచంద్రులు ఉన్నంత కాలం, తెలంగాణ రాష్ట్రం ఉన్నంత కాలం కేసీఆర్ పేరు పలుకుతూనే ఉంటారన్నారు. ప్రాణాన్ని లెక్క చేయకుండా రాష్ట్రాన్ని సాధించిన ధీరుడు కేసీఆర్ అని సబితారెడ్డి కొనియాడారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు కొప్పుల నాగారెడ్డి, హరిప్రియ, మలిపెద్ది మేఘమాల, రాందాస్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీలు కరణం అరవిందరావు, మల్లేశం, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, పీఏసీఎస్ చైర్మన్ కొప్పు ల శ్యాంసుందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కాసాని వీరేశ్, గణేశ్‌గుప్తా, సురేందర్, ఆంజనేయులు, సుధాకర్‌రెడ్డి, రాజేందర్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సుభాష్‌చందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రాంచంద్రయ్య, అజహర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

### కేసీఆర్‌కు బహుమతిగా ఇద్దాం..



ఆశీర్వదించి గెలిపిస్తే ప్రజలకు అండగా ఉంటా. పార్లమెంట్‌లో తెలంగాణ వాణిని వినిపిస్తా. కేసీఆర్ పాలనలో ప్రజలకు మంచి పనులు జరిగాయి. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఇంటింటికీ చేరాయి. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లా ల ప్రజలతో మంచి సంబంధాలున్నాయి. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రెండు నెలలపా టు ప్రజాక్షేత్రంలో ఉండాలి. చేవెళ్లలో భారీ మెజార్టీతో విజయం సాధించి పార్టీ అధినేత కేసీఆర్‌కు బహుమతిగా ఇద్దాం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే కరెంట్ కష్టాలు మొదలయ్యాయి. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ ప్రజల్లోకి దూసుకెళ్తాం.

**-కాసాని జ్ఞానేశ్వర్, బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి**

### పదేండ్లలో ఆనందంగా ప్రజలు..



పదేండ్ల కేసీఆర్ పాలనలో ప్రజలు ఆనందంగా ఉన్నారు. నిరంతరం నాణ్యమైన విద్యుత్తును అందించిన ఘనత ఆయనకే దక్కింది. కాంగ్రెస్ వంద రోజుల పాలనలో ప్రజలు కరెంటు కష్టాలు పడుతున్నారు. మన ప్రాంతం వారు కాకున్నా రంజిత్‌రెడ్డిని గెలిపించుకున్నాం. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆయన ఎప్పుడు చూసినా కేసీఆర్, కేటీఆర్ దగ్గరే ఉండేవారు. అధికారం కోల్పోగానే పార్టీ మారడం ఎంతవరకు సమంజసం. బీఆర్ఎస్ శ్రేణులు కష్టపడి పనిచేసి రానున్న ఎన్నికల్లో బీసీ నాయకుడైన కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలి

**- ప్రకాశ్‌గౌడ్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే**

### విశ్వాసం లేని బతుకు అదేం బతుకు : ఎమ్మెల్సీ వాణీదేవి



ఎవరి నుంచైనా సాయం పొందినప్పుడు విశ్వాసంతో ఉండాలి. విశ్వాసం లేని బతుకు అదేం బతుకు. పార్టీ ఓడిపోయిన వెంటనే అధికారం అనుభవించిన వారు పార్టీ మారడం సరికాదు. రంజిత్‌రెడ్డి ఎవరో కూడా ప్రజలకు తెలియదు.. అలాంటి వ్యక్తికి కేసీఆర్ ఎంపీ టికెట్ ఇచ్చి గెలిపించడంతోపాటు.. సునీతారెడ్డిని రెండు పర్యాయాలు జడ్పీ చైర్‌పర్సన్‌గా, మహేందర్‌రెడ్డికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రిగా అవకాశం కల్పించారు. అలాంటి వారు పార్టీ మారడం ఎంతవరకు సమంజసం. ప్రతి మనిషికీ విలువ అనేది ఉండాలి. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి జరిగింది. గెలుపోటములు ఎవరి చేతుల్లో లేవు. బీఆర్ఎస్ శ్రేణులు సైనికులవలె పనిచేసి చేవెళ్ల ఎంపీగా జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి.

## ఈఎస్‌సీఐలో స్కిల్ ట్రైనింగ్ ప్రోగ్రాం

సిటీబ్యూరో, మార్చి 23(నమస్తే తెలంగాణ): గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన స్కిల్ ట్రెయినింగ్ ప్రోగ్రాం శనివారంతో ముగిసింది. ఆర్టిఫిషియెల్ ఇంటెల్లీజెన్స్, బ్లాక్ చైయిన్ టెక్నాలజీ, బిగ్ డేటా అనలైటిక్స్‌పై నిపుణులతో చర్చోపచర్చలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పాండిచ్చేరి యూనివర్సిటీ నుంచి 83 మంది విద్యార్థులు, ఫ్యాకల్టీ పాల్గొన్నారు.



## మెట్రో ఎండీకి మేనేజర్ ఆఫ్ ది ఇయర్ పురస్కారం



ఎన్వీఎస్ రెడ్డికి అవార్డు అందజేస్తున్న ఐటీ మంత్రి శ్రీధర్ బాబు, చిత్రంలో తదితరులు

సిటీబ్యూరో, మార్చి 23(నమస్తే తెలంగాణ): మెట్రో రైలు ఎం.డీ ఎన్వీఎస్ రెడ్డి 'మేనేజర్ ఆఫ్ ది ఇయర్' అవార్డును అందుకున్నారు. నగరంలో హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు ఈ అవార్డును ఎన్వీఎస్ రెడ్డికి అందజేశారు. 40 ఏండ్లకు పైగా అనేక ప్రభుత్వ సంస్థల ద్వారా రాష్ట్రంలో పలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను విజయవంతంగా నిర్వహించారని, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్‌గా అసాధారణ నాయకత్వ పటిమతో ప్రపంచంలోనే అతి పెద్ద పొడవైన మెట్రో ప్రాజెక్టును పీపీపీ విధానంలో పూర్తి చేశారని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంఏ అధ్యక్షులు జయవంత్ నాయుడు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బి.జె.రావు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

## బీసీ జోడో యాత్ర షురూ..



బీసీల డిమాండ్లను పరిష్కరించాలని, పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు పది సీట్లు ఇవ్వాలని, బీసీలకు సంబంధించిన పలు డిమాండ్లపై విధానపరమైన ప్రకటన చేసి తమ మేనిఫెస్టోలలో చేర్చాలని శనివారం విద్యానగర్‌లోని బీసీ భవన్ నుంచి జోడో యాత్రను బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రారంభించారు. జాతీయ బీసీ యువజన సంఘం అధ్యక్షుడు గవ్వల భరత్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్, నందగోపాల్, రాజ్ కుమార్, అంజి, ప్రవీణ్ ముదిరాజ్, ఉదయ్, రోహిత్, నాగరాజు, లోకేశ్ పాల్గొన్నారు. - ముషీరాబాద్, మార్చి 23;

## ముఖ్యమంత్రుల అరెస్టు నిరంకుశత్వానికి నిదర్శనం

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య**



చిక్కడపల్లి, మార్చి 23: దేశంలో ప్రతిపక్ష నాయకులపై మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం దుర్మార్గపు ప్రవర్తన హేయనీయమని, ఇంకా వారిని అరెస్టు చేయడం దుర్మార్గపు వ్యవస్థకు ఈ చర్యలు పరాకాష్ట అని వామపక్ష పార్టీల నాయకులు విమర్శించారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలకు నాయకత్వం వహించే ముఖ్యమంత్రులను అరెస్టు చేయడం నిరంకుశ ధోరణులకు నిదర్శమన్నారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శనివారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో మోదీ ప్రభుత్వ నిరాధార చర్యలను వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. 'మోదీ ప్రభుత్వ నిరంకుశ వైఖరి నశించాలి, మోదీ హటావో దేశ్‌కో బచావో' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య మాట్లాడుతూ, రాజ్యాంగ ఆధారంగా ఎన్నికైన పీఎం మోదీ ఆ విలువలను తుంగలో తొక్కుతున్నారని మండిపడ్డారు. బీజేపీకి వ్యతిరేకంగా ఏర్పడిన కూటమిలో ఆప్ భాగస్వామ్యంగా ఉందని, ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారని, అంతకు ముందు జార్ఖండ్ సీఎం హేమంత్‌ను అదే పనిచేశారన్నారు. సీఎంలను అరెస్టు చేయడమనే కొత్త పద్ధతికి బీజేపీ తెరలేపిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా, (ఎంఎల్) రాష్ట్ర నేత కె.గోవర్ధన్, జానకి రాములు, చలపతి రావు, రమేశ్‌రాజా, ప్రసాద్, డీజీ నర్సింహా, బాల మల్లేశ్, టి.సాగర్, లక్ష్మి పాల్గొన్నారు.

## ప్రతిపక్షాల గొంతు నొక్కడం మోదీ నైజం

- **సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య**

శంషాబాద్ రూరల్, మార్చి 23: ప్రతిపక్షాల గొంతు నొక్కడం మోదీకి అలవాటుగా మారిందని, నిర్బంధాలు ఎక్కువైతే తిరుగుబాటు తప్పదని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. శంషాబాద్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్టు, కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాలను సీజ్‌కు నిరసనంగా సీపీఐ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించా రు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం, ప్రతిపక్షాలు లేకుండా చేయాలనే కుట్రలో భాగంగా కేంద్రంలోని దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తూ ప్రతిపక్షాల నాయకులపై అక్రమ కేసులు నమోదు చేసి వేధింపులకు గురిచేస్తుందని విమర్శించారు.

